క్లుప్తంగా

వరసిద్ధుని సేవలో జడ్జి


హైకోర్టు న్యాయమూర్తికి స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాకంలో వెలసిన వరసిద్ధి వినాయక స్వామిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటజ్యోతిర్మయి శనివారం దర్శించుకున్నారు. ఉదయం స్వామివారి దర్శనార్థం హైకోర్టు న్యాయమూర్తి విచ్చేయగా ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, చిత్తూరు డీఎస్పీ శ్రీనివాస్‌మూర్తి, సీఐ రవిశంకర్ రెడ్డి పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ



బంగారుపాళెం: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు శనివారం ఉచితంగా దుస్తులను పంపిణీ చేశారు. దాత వంకరవారి పల్లె ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు శ్రీమతి, కార్మికులకు దుస్తులను అందజేసినట్లు ఐసీటీసీ కౌన్సిలర్ బాబు తెలిపారు.

రోగులకు పండ్లు పంపిణీ

రాష్ట్ర పాల ఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా పుట్టిన రోజు సందర్భంగా శనివారం రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. పలువురు నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు ఆయన్ను స్వగృహంలో కలసి పుష్పగుచ్ఛాలను అందించి పుట్టినరోజు శుభాకాంక్షలను తెలియజేశారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

సబ్‌స్టేషన్ ప్రారంభం


సబ్‌స్టేషన్ ప్రారంభిస్తున్న ఎస్ఈ కృష్ణారెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని అనుపల్లె జగనన్న కాలనీలో దాదాపు రూ.2 కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన సబ్‌స్టేషన్‌ను శనివారం ట్రాన్స్‌కో ఎస్ఈ కృష్ణారెడ్డి సాంకేతికంగా ప్రారంభించారు. 5 మెగావాట్ల సామర్థ్యంతో కాలనీ, చుట్టు పక్కల ప్రాంతాలను విద్యుత్ సరఫరాను అందించనున్నట్లు చెప్పారు. పుంగనూరు నియోజకవర్గంలో ఆదివారం మూడు సబ్‌స్టేషన్లను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈఈలు పద్మనాభపిళ్లై, దామోదారం, డీఈఈలు శేషాద్రి, జ్ఞానేశ్వర్, ఏఈలు విశ్వప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు బహుమతులు



చిత్తూరు రూరల్: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని చిత్తూరు నగరం లక్ష్మీనగర్‌కాలనీలోని అనాథ ఆశ్రమంలో శనివారం అపోలో యూనివర్సిటీ హెల్త్ క్లబ్ మెంబర్స్ ఆటల పోటీలు నిర్వహించారు. కేక్‌కట్ చేసి పిల్లలకు పంచిపెట్టారు. అనంతరం ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతలు ప్రదానం చేశారు.

కాణిపాకం: పట్టు వస్త్రాలను తీసుకొస్తున్న ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, చిత్తూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో కిటకిటలాడుతున్న భక్తులు , యాదమరి: పురవీధుల్లో విహరిస్తున్న ఇంద్రవరద స్వామివారు






వైకుంఠ ఏకాదశి వైభవం

- వేకువజాము నుంచే అభిషేకాలు
- ఆలయాలకు తరలివచ్చిన భక్తజనం
- ఉత్తర ద్వారంలో భక్తులకు ప్రవేశం

చిత్తూరు రూరల్: జిల్లా వ్యాప్తంగా శనివారం వైకుంఠ ఏకాదశి పండుగను వైభవంగా నిర్వహించారు. నగరంలోని వెంకటేశ్వరస్వామి ఆలయం, కట్టమంచిలోని వరదరాజస్వామి ఆలయం, గిరింపేటలోని వెంకటేశ్వరస్వామి ఆలయం, దుర్గాంబ దేవస్థానంలో ఏకాదశి పూజలు నిర్వహించారు. వేకువ జాము నుంచే అర్చకులు స్వామివారికి అభిషేక పూజలు నిర్వహించారు. ఉత్తర ద్వారం నుంచి భక్తులకు ప్రవేశం కల్పించారు. అనంతరం నగర వీధుల్లో స్వామివార్లను అంగరంగవైభవంగా ఊరేగించారు. భక్తులు స్వామివారికి కర్పూర హారతులు పట్టి మొక్కులు చెల్లించుకున్నారు. రాములు గుడివీధిలోని శ్రీ కోదండరామస్వామి వారు గరుడసేవలో తరించారు.

వరదరాజుల స్వామికి పట్టు వస్త్రాలు

కాణిపాకం(యాదమరి): కాణిపాకంలోని శ్రీ వరదరాజులస్వామి వారికి వరసిద్ధి వినాయక స్వామి పట్టు వస్త్రాలను ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు అందించారు. మేళ తాళాలతో మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా పట్టు వస్త్రాలను తీసుకెళ్లి సమర్పించారు. పట్టు వస్త్రాలను మూలవిరాట్‌కు అలంకరించి, ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలతో భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ఆవరణంలో శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజుల స్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు అలంకరణలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలు మంగళ వాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.

గరుడవాహనంపై ఇంద్రవరదుడు

యాదమరి: మండల కేంద్రంలో వెలసిన ఇంద్రవరదుడు శనివారం గరుడవాహనంపై విహరించారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఇంద్రవరదుని ఆలయంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమతే ఇంద్రవరదునికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు నిర్వహించి పూజలు చేశారు. భక్తులు వైకుంఠ ద్వారంలో వచ్చి స్వామివారిని దర్శించుకునేలా ఏర్పాటు చేశారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహానికి


కాణిపాకంలో గజాసుర వాహనంపై విహరిస్తున్న వరసిద్ధి వినాయకస్వామివారు

అలంకార మండపంలో ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేసి గరుడవాహనంపై కొలువుదీర్చారు. ప్రత్యేక పూజల అనంతరం గరుడవాహనంపై స్వామివారు ఊరేగారు. స్వామివారికి భక్తులు కొబ్బరికాయలు కొట్టి మంగళ హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

కోదండరామస్వామి ఆలయంలో..

ఐరాల: మండల కేంద్రంలోని శ్రీ కోదండరామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, క్షీరాభిషేకం, అర్చనలు, అలంకరణలు, నిర్వహించారు. స్వామివారిని ఆలయ ప్రాంగణంలో గరుడ వాహనంపై కొలువుదీర్చారు. భక్తులకు ఉత్తర ద్వారం నుంచి స్వామివారి దర్శనభాగ్యం కల్పించారు.

భక్తి శ్రద్ధలతో పండుగ

పూతలపట్టు: మండలంలోని పి.కొత్తకోట పంచాయతీ శ్రీనివాసపురంలో వెలసిన శ్రీ వెంకటేశ్వరాలయంలో ప్రత్యేక అభిషేకాలు చేశారు. వేకువజామున భక్తులతో ఆలయం కిటకిటలాడింది. అనంతరం గ్రామస్తులు సాయంత్రం భజన కార్యక్రమాలు నిర్వహించారు.

ఏకాదశి పూజలు

బంగారుపాళెం: మండలంలోని రామాలయాలు, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం ముక్కోటి ఏకాదశి పూజలను భక్తులు ఘనంగా నిర్వహించారు. నలగాంపల్లె దేవరకొండపై వెలసిన శ్రీదేవి భూదేవి సమ్మేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ద్వారం నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉపవాసాలతో భక్తులు జాగారం చేశారు. మొగిలివెంకటగిరి గ్రామంలోని శ్రీకోదండ రామస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి మేళతాళాలు, మంగళవాయిద్యాల గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

అలరించిన కోలాటం

తవణంపల్లె: మండల కేంద్రంలోని వెలసిన కోదండరామస్వామి దేవస్థానంలో సీతారామలక్ష్మణులు, ఆంజనేయస్వామికి అర్చకులు అభిషేకం చేయించారు. ప్రత్యేక అలంకరణ, పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయంలో ప్రత్యేక ఏర్పాటు చేసిన వైకుంఠద్వారం ద్వారా భక్తులు స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో శ్రీరామ భజనలు, కోలాటలు, చెక్కల భజనలు అలరించాయి. టీటీడీ ఆధ్వర్యంలో హరికథాకాలక్షేపం సాగింది. రాత్రి గరుడ వాహనంపై సీతారాములు కొలువుదీరి పురవీధుల్లో ఊరేగారు. భక్తులు ఇంటింటా స్వామికి కొబ్బరికాయలు కొట్టి, కర్పూర, మంగళహారతులిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. టి.పుత్తూరు కోదండరామస్వామి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

అలరించిన క్రిస్మస్ సంబరాలు

బృందావన్ పాఠశాలలో..



శాంతాక్లాజ్ వేషధారణలో..



చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని పలు విద్యాసంస్థల్లో శనివారం క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు. వేడుకల్లో విద్యార్థులు శాంతాక్లాజ్, దేవదూత వేషధారణలో విచ్చేసి అందరినీ ఆకట్టుకున్నారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు.

హక్కులపై అవగాహన అవసరం

చిత్తూరు రూరల్ : నగరంలోని పీవీకేఎన్ కళాశాలలో శనివారం జాతీయ వినియోగదారుల దినోత్సవం నిర్వహించారు. డీఎస్ఓ శంకరన్ మాట్లాడుతూ వినియోగదారుల హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని కోరారు. చట్టాల్లో వస్తున్న మార్పులను గమనించాలని, మోసానికి గురైనప్పుడు ప్రశ్నించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ మోహన్‌బాబు, ప్రిన్సిపల్ జీవన జ్యోతి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎస్ఓ శంకరన్

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ


ఆరోగ్య శ్రీ కార్డును అందజేస్తున్న వైద్యులు

యాదమరి: మండలంలోని గ్రామాల్లో ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ ముమ్మరంగా సాగుతోంది. మండలంలోని 180 కొత్తపల్లె గ్రామంలో ఈ పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా ఆరోగ్యశ్రీ సంచాలకులే డాక్టర్ సుదర్శన్ శనివారం తనిఖీ చేశారు. ఆయన ప్రజలతో మాట్లాడుతూ పేద ప్రజలు రూపాయి ఖర్చు లేకుండా రూ.25 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలు చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో యాదమరి ప్రభుత్వాసుపత్రి వైద్యులు రేఖ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ పరిధిలో ప్రజారోగ్య, ఇంజినీరింగ్ విభాగంలో విధులు నిర్వహించే ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ అరుణ అన్నారు. నగర పాలక కార్యాలయంలో శనివారం ఉద్యోగుల ఫిర్యాదులు, పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంజినీరింగ్, పారిశుద్ధ్య విభాగంలో విధులు నిర్వహించే ఉద్యోగులు, కార్మికుల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ఉద్యోగులు, కార్మికుల నుంచి అందిన ఫిర్యాదులపై అక్కడికక్కడే అధికారులతో సమీక్షించి, వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

వారికి పని కల్పించాలి

అవుట్ సోర్సింగ్ విధానం ద్వారా పనిచేస్తూ మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించాలని నగరపాలక సంస్థ పొరుగు సేవకుల సంఘం ఇంజినీరింగ్ విభాగం గౌరవ అధ్యక్షులు గంజి రామమూర్తి కోరారు. ఈ మేరకు స్పందన కార్యక్రమంలో భాగంగా కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు.

వార్డు సచివాలయం తనిఖీ

నగరంలోని 23వ వార్డు సచివాలయాన్ని (జానకారపల్లి) కమిషనర్ అరుణ శనివారం తనిఖీ చేశారు.


అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వినతి పత్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ

సచివాలయం పరిధిలో పన్నుల వసూలు, హౌసింగ్, సంక్షేమ పథకాల అమలు అంశాలపై సంబంధిత వార్డు కార్యదర్శులతో సమీక్షించారు. వార్డు కార్యదర్శుల వారీగా రికార్డులను తనిఖీ చేశారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, స్థానిక ప్రజలతో స్నేహపూర్వకంగా ఉంటూ మెరుగైన సేవలు అందించాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు చీపుర్లు, పుష్కాట్ వీల్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంఈ గోమతి, ఎంహెచ్వో లోకేష్, మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి, సీఎంఎం గోపి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం

బంగారుపాళెం: గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం అందించేందుకు ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో శనివారం 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ చేశారు. అనంతరం రామచంద్రారెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పోటీలను నిర్వహిస్తోందని చెప్పారు. మండల స్థాయిలో 26వ తేదీ నుంచి క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్, సర్పంచ్‌లు ఉమాదేవి, వాణీప్రియ, ఎంపీటీసీలు ఉషా, హేమచంద్ర, తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి, ఎంఈఓలు నాగేశ్వర్‌రావు, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేద్దాం

ఐరాల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ నాగరాజు కోరారు. ఆయన శనివారం మండలంలోని రెడ్డివారిపల్లె సచివాలయం నుంచి విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం బజారువీధిలో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓలు రుషీంద్రబాబు, దామోదర్‌నాయుడు, ఈఓపీఆర్డీ కుసుమకుమారి, హెచ్ఎం కోమల, పీడీ దేవా పాల్గొన్నారు.


ఐరాల: విద్యార్థులతో కలిసి మానవహారం నిర్వహిస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓలు

అవగాహన ర్యాలీ

పూతలపట్టు: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ పెనుగొండ పరిశీలకులు బాబురెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో శనివారం ఎంపీడీఓ గౌరి ఆధ్వర్యంలో ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామీణుల్లో క్రీడా నైపుణ్యాలను వెలికితీయడానికే ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి జాన్‌విక్టర్, వైఎస్సార్‌సీపీ నాయకులు జగదీశ్వర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, సర్పంచ్ సంఘం అధ్యక్షులు జయచంద్రారెడ్డి, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆడుదాం–ఆంధ్రా కార్యక్రమంపై ర్యాలీ

యాదమరి: ఆడుదాం–ఆంధ్రా కార్యక్రమంపై ప్రజాప్రతినిధులు, యాదమరి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మండల కేంద్రంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎంపీపీ సురేష్‌బాబు, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి, అధికారులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రత్యేక అధికారి బోగమరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు ఎంతో అవసరం అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హనుమంతు, ఎంపీడీఓ శివరాజ్, యాదమరి ఉన్నత పాఠశాల హెచ్ఎం గిరిరాజ తదితరులు పాల్గొన్నారు.



బంగారుపాళెం: ర్యాలీలో విద్యార్థులు, అధికారులు, పూతలపట్టు: ర్యాలీని ప్రారంభిస్తున్న నాయకులు